జోస్ ఆలుక్కాస్ మకర సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్, జనవరి 16: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్..సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్లలో భాగంగా ప్రతి బంగారు ఆభరణం కొనుగోలుపై ఒక వెండి నాణెం, తరుగుదలలో 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చునని తెలిపింది. అలాగే పాత బంగారు ఆభరణాలను 100 శాతం హెచ్‌యూఐడీ ఆభరణాలకు ఎక్స్చేంజ్ చేసుకునే అవకాశం కూడా ఉన్నదని జోస్ ఆలుక్కాస్ చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు.

జియో రిపబ్లిక్ డే ఆఫర్

న్యూఢిల్లీ, జనవరి 16: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో..ప్రత్యేకంగా రిపబ్లిక్ డేను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.2,999 ప్రీపెయిడ్ ప్లాన్‌పై రూ.3 వేలకు పైగా ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపింది. ఈ నెల 31 వరకు మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉండనున్నది. ఈ ప్లాన్ కింద 2.5 జీబీల 4జీ డాటా, 365 రోజులు 5జీ అన్‌లిమిటెడ్ డాటా తోపాటు అన్‌లిమిటెడ్ కాలింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. వీటితోపాటు స్విగ్గీ, ఆజియో కూపన్స్, విమాన టిక్కెట్లపై రాయితీ, రిలయన్స్ డిజిటల్‌లో ఎంపిక చేసిన ఉత్పత్తులపై 10 శాతం తగ్గింపు ధరకే అందిస్తున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త డిపాజిట్ స్కీం

ముంబై, జనవరి 16: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రత్యేక డిపాజిట్ స్కీంను ప్రకటించింది. ఈ స్కీంపై సీనియర్ సిటిజన్లకు 7.6 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..ఇతరులకు 7.1 శాతం చొప్పున వడ్డీని చెల్లిస్తున్నది. అలాగే 271 రోజుల బల్క్ డిపాజిట్లపై 6.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. పాత, కొత్త కస్టమర్లు బల్క్ డిపాజిట్ స్కీంలో చేరవచ్చునని, ఇందుకు సంబంధించి బ్యాంక్ బ్రాంచ్, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా కూడా డిపాజిట్ చేసుకునే అవకాశం కూడా బ్యాంక్ కల్పించింది.

హెచ్‌ఎఫ్‌సీలకు ఆర్బీఐ ఝలక్

కఠినతరం కానున్న డిపాజిట్ల నిబంధనలు

ముంబై, జనవరి 16: హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్‌ఎఫ్‌సీ)లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఝలక్ ఇచ్చింది. పబ్లిక్ డిపాజిట్లకు సంబంధించిన నిబంధనల్ని కఠినతరం చేస్తూ తాజాగా పలు ప్రతిపాదనల్ని చేసింది. ఈ క్రమంలోనే డిపాజిట్ల మెచ్యూరిటీ కాలాన్ని ఐదేండ్లకు తగ్గించాలని నిర్ణయించింది. అంతేగాక చెల్లింపులకుగాను ఉండాల్సిన లిక్విడ్ అసెట్స్ పెంచాలని కూడా చూస్తున్నది. ప్రస్తుతం ఏడాది నుంచి పదేండ్లదాకా మెచ్యూరిటీ డిపాజిట్లను హెచ్‌ఎఫ్‌సీలు తీసుకోవచ్చు. అయితే దీన్ని ఏడాది నుంచి ఐదేండ్లకే ఆర్బీఐ కుదిస్తున్నది. కానీ ఇప్పటికే ఉన్న డిపాజిట్లు మాత్రం పాత నిబంధనల ప్రకారమే మెచ్యూరిటీ అవుతాయి. ఇక డిపాజిట్ల కోసం హెచ్‌ఎఫ్‌సీలు మెయింటేన్ చేయాల్సిన లిక్విడ్ అసెట్స్ ఇప్పుడు 13 శాతంగా ఉండాలి. అయితే వచ్చే మార్చి ఆఖరుకల్లా 15 శాతానికి పెంచనున్నారు. కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో 9 హెచ్‌ఎఫ్‌సీలు డిపాజిట్లను తీసుకుంటున్నాయి. వాటిలో ఐసీఐసీఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ, ఎల్‌ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ, మణిపాల్ హౌజింగ్ ఫైనాన్స్ సిండికేట్, పీఎన్‌బీ హౌజింగ్ ఫైనాన్స్, సుందరం హోమ్ ఫైనాన్స్, కెన్ ఫిన్ హోమ్స్, సెంట్ బ్యాంక్ హోమ్ ఫైనాన్స్, ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్, హౌజింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నాయి. నేషనల్ హౌజింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) వివరాల ప్రకారం సరళ్ హోమ్ ఫైనాన్స్, జీఐసీ హౌజింగ్, రెప్కో హోమ్ ఫైనాన్స్ కూడా డిపాజిట్లను అనుమతిస్తున్నాయి. అయితే ముందుగా ఎన్‌హెచ్‌బీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ఏప్రిల్ 1 నుంచి..

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సవరించిన ఫెయిర్ లెండింగ్ విధానం అమల్లోకి రానున్నట్టు ఆర్బీఐ ప్రకటించింది. ఇది రుణ ఎగవేతలపై ఇష్టారీతిన బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు జరిమానాలు వేయకుండా నిరోధిస్తుంది. గత ఏడాది ఆగస్టు 18న ఆర్బీఐ ఈ కొత్త నిబంధనల్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

ఆర్బీఐ పాలసీపై..

ఈ ఏడాది ఆగస్టు నుంచి కీలక వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ తగ్గించవచ్చని జపాన్ బ్రోకరేజీ దిగ్గజం నోమురా అంచనా వేసింది. ఆగస్టు నుంచి వరుస ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు 1 శాతం తగ్గేందుకు వీలున్నట్టు పేర్కొన్నది. ద్రవ్యోల్బణం మున్ముందు తగ్గుముఖం పడితే వడ్డీరేట్లు ఇంకా దిగిరావచ్చన్నది. ఈ నేపథ్యంలోనే జనవరిలో రిటైల్ ధరల సూచీ 5 శాతం దరిదాపుల్లోకి రావచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. కాగా, డిసెంబర్‌లో 4 నెలల గరిష్ఠాన్ని తాకుతూ రిటైల్ ద్రవ్యోల్బణం 5.7 శాతంగా, 9 నెలల గరిష్ఠాన్ని చేరుతూ టోకు ద్రవ్యోల్బణం 0.73 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. విజృంభిస్తున్న ద్రవ్యోల్బణాన్ని అడ్డుకునేందుకే ఆర్బీఐ వరుస వడ్డింపుల్లో రెపోరేటును 2.5 శాతం పెంచిన సంగతి విదితమే. ప్రస్తుతం రెపో 6.5 శాతంగా ఉన్నది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలన్నీ ప్రియమైపోయాయి. రుణగ్రహీతలపై ఈఎంఐల భారం కూడా పెరిగిపోయింది. నిజానికి కరోనా సమయంలో దిగాలు పడిన ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు రెపోరేటును ఆర్బీఐ పెద్ద ఎత్తున తగ్గించింది. ఫలితంగా అంతా రుణాలను తీసుకుని ఇండ్లు, వాహనాలను కొన్నారు. రియల్ ఎస్టేట్, ఆటో రంగాలకు ఇది ఎంతగానో కలిసొచ్చింది. అయితే కరోనా తగ్గడం, ద్రవ్యోల్బణం మళ్లీ పెరగడంతో రెపోను ఆర్బీఐ పెంచేసింది.

వ్యక్తిగత రుణాలు ప్రియం?

వ్యక్తిగత రుణాలు ఖరీదెక్కనున్నాయా? అంటే రుణదాతల నుంచి అవుననే సమాధానాలే వస్తున్నాయిప్పుడు. ఆర్బీఐ తెచ్చిన కొత్త నిబంధనలతో ఈ ఏడాది వడ్డీరేట్లు 1.5 శాతం వరకు పెరిగే వీలుందని చెప్తున్నారు. అన్‌సెక్యూర్డ్ లోన్ల విభాగంలో ఉన్న వ్యక్తిగత రుణాల వంటివి గడిచిన కొన్నేండ్లుగా విపరీతంగా పెరుగుతుండటాన్ని ఆర్బీఐ గమనించింది. ఈ క్రమంలోనే రిస్క్ వెయిటేజీని 100 నుంచి 125 శాతానికి పెంచింది. వచ్చే నెల 29కల్లా కొత్త నిబంధనల్ని ఆర్బీఐ పర్యవేక్షణలో ఉన్న అన్ని బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తప్పక పాటించాల్సిందే. ఇప్పటికే ఆయా బ్యాంకులు ఈ దిశగా అడుగులు వేయగా, మరికొన్ని సిద్ధమవుతున్నాయి.

ఏం జరుగుతుంది?

ఆర్బీఐ కొత్త రూల్స్‌తో వ్యక్తిగత రుణాలను తీసుకున్నవారు మరింతగా చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ పర్సనల్ లోన్ల కోసం తమ మూలధన నిల్వల్ని పెంచుకోవాల్సి వస్తున్నది మరి. నిపుణుల వివరాల ప్రకారం ప్రస్తుతం బ్యాంకులిచ్చే ప్రతీ రూ.100 పర్సనల్ లోన్‌కు తమ డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణార్థం మరో రూ.100ను బ్యాంకులు రిస్క్-వెయిటెడ్ అసెట్స్‌గా పెట్టాల్సి వస్తున్నది. అయితే ఆర్బీఐ సవరించిన రూల్స్‌తో ఇక రూ.125ను కేటాయించాలి. ఇక క్యాపిటల్ అడికేసీ రేషియో (సీఏఆర్) కింద ఈ రూ.125లో 9 శాతం (రూ.11.25) పక్కన పెట్టాలి. ఇంత కుముందు ఇది రూ.9గానే ఉండేది. అంటే ప్రతీ రూ.100 పర్సనల్ లోన్‌కు అదనంగా రూ.2.25 క్యాపిటల్‌ను బ్యాంకులు సమకూర్చుకోవాల్సి వస్తున్నది. ఈ భారం అంతిమంగా రుణగ్రహీతలపైనే పడుతుందని, వడ్డీరేట్ల పెంపు ద్వారానే అది ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది పర్సనల్ లోన్లపై వడ్డీరేట్లు గరిష్ఠంగా 1.5 శాతం వరకు పెరగవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదిలావుంటే క్రెడిట్ కార్డుదారులకూ ఈ కొత్త రూల్స్ సెగ తగలనున్నది. బ్యాంకులు రిస్క్ వెయిటేజీని 150 శాతానికి పెంచాలి. ఇప్పుడు 125 శాతమే. ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇప్పుడున్నదానికి 25 శాతం పెంచాలి. దీంతో క్రెడిట్ కార్డు వినియోగదారులూ అధికంగా చెల్లించాల్సి వస్తున్నది. ఈ రూల్స్‌తో మార్కెట్ల నుంచి రుణదాతలు ఎక్కువ నిధులను సమీకరించాల్సి వస్తున్నదని, దాంతో సదరు మొత్తాలకు చెల్లించే సొమ్మును రుణగ్రహీతల నుంచే సహజంగా వడ్డీరేట్ల పెంపుతో వసూలు చేస్తారని బ్యాంకింగ్ నిపుణులు చెప్తున్నారు. కనుక అధిక వడ్డీరేట్ల భారం తప్పదనే అంటున్నారు.

అదానీ షేర్లను తగ్గించుకున్న ఎల్‌ఐసీ

- క్యూ3లో 3.7 కోట్ల షేర్ల విక్రయం

న్యూఢిల్లీ, జనవరి 16: ఏడాదికాలంగా వివాదాలకు కేంద్ర బిందువైన అదానీ గ్రూప్ షేర్లను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) క్రమేపీ తగ్గించుకుంటున్నది. ముఖ్యంగా మూడు అదానీ కంపెనీలు..అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ వాటాల్ని పెద్ద మొత్తంలో విక్రయించింది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో ఈ మూడు కంపెనీలకు చెందిన 3.73 కోట్ల షేర్లను ఎల్‌ఐసీ వదిలించుకుంది. గౌతమ్ అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడుతున్నదంటూ గత ఏడాది జనవరిలో యూఎస్ హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ వెలువడిన తర్వాత ఈ కంపెనీల్లో ఎల్‌ఐసీ పెట్టుబడులపై వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే ఎల్‌ఐసీ ద్వారా అదానీ షేర్లను కొనిపిస్తున్నదంటూ పలు రాజకీయ పక్షాలు ఆరోపించిన విషయం విదితమే. 2023 జనవరి 27నాటికి అదానీ గ్రూప్ షేర్లలో ఎల్‌ఐసీకి రూ.56,142 కోట్ల విలువైన పెట్టుబడులు ఉండగా, జూన్‌కల్లా ఇవి రూ.30,000 కోట్లలోపునకు తరిగిపోయాయి. తదుపరి స్టాక్ మార్కెట్ ర్యాలీలో భాగంగా ఈ గ్రూప్ షేర్లు సైతం క్రమేపీ పెరగడంతో 2023 సెప్టెంబర్ చివరినాటికి వీటి విలువ రూ.45,025 కోట్లకు చేరింది. అటుత ర్వాత మరింత ర్యాలీ జరిగిన కారణంగా కొన్ని అదానీ కంపెనీల షేర్లను ఎల్‌ఐసీ విక్రయిస్తూ వచ్చింది. విక్రయ వివరాలు...

అదానీ ఎనర్జీ సొల్యూషన్స్: క్యూ2లో 3.68 శాతంగా ఉన్న వాటాను క్యూ3లో 3 శాతానికి తగ్గించుకున్నది. ఈ త్రైమాసికంలో అదానీ ఎనర్జీ షేరు 42 శాతం పెరిగింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్: గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ఎల్‌ఐసీ వాటా 4.23 శాతం నుంచి 3.93 శాతానికి తగ్గింది. క్యూ3లో ఇది 29 శాతం ర్యాలీ చేసింది.

అదానీ పోర్ట్స్: అదానీ గ్రూప్ కంపెనీల నిన్నటిలోకి అదానీ పోర్ట్స్‌లోనే కార్పొరేషన్‌కు అధిక వాటా ఉన్నది. క్యూ2లో 9.07 శాతం ఉండగా, క్యూ3లో ఇది 7.86 శాతానికి తగ్గింది. ఈ షేరు డిసెంబర్ త్రైమాసికంలో 46 శాతం ఎగిసింది.

ఇతర అదానీ స్టాక్స్..ఏసీసీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్‌లో ఎల్‌ఐసీ వాటా యథాతథంగా ఉన్నది. క్యూ2ఓ 4,500 అంబూజా సిమెంట్స్ షేర్లను కొనుగోలు చేసింది. ఈ కంపెనీని అదానీ గ్రూప్ కొనుగోలు చేయకముందు నుంచి ఎల్‌ఐసీకి 6 శాతం మేర వాటా ఉన్నది.

స్కైడ్రైవ్‌తో మారుట్ డ్రోన్స్ జట్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ స్టార్టప్ కంపెనీ మారుట్ డ్రోన్స్... జపాన్‌కు చెందిన స్కైడ్రైవ్‌తో జట్టుకట్టింది. ఈ సందర్భంగా మారుట్ డ్రోన్స్ వ్యవస్థాపకులు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విమానయాన రంగంలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకురావాలనే ఉద్దేశంతో స్కైడ్రైవ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రకాల డ్రోన్‌లను రూపొందించి వ్యవసాయ రంగంతోపాటు ఇతర కార్యకలాపాలకు డ్రోన్‌లను తయారు చేసి అందిస్తున్నామని, తాజాగా స్కైడ్రైవ్‌తో కుదిరిన ఒప్పందంతో ఎయిర్ ట్యాక్సీలను రూపొందించి దేశ వ్యాప్తంగా వాడుకలోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్లు ప్రేమ్ తెలిపారు.

భరోసా కేంద్రానికి మైండ్‌స్పేస్ విరాళం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్‌లో భరోసా భవన నిర్మాణానికి సీఎస్ఆర్‌లో భాగంగా రూ. 2 కోట్ల విరాళాన్ని మైండ్‌స్పేస్ ఆర్ఈఐటీ ప్రకటించింది. ఇందుకు సంబంధించి మంగళవారం రూ. 2 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతికి కే రహేజా కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(తెలంగాణ, ఏపీ) శ్రావన్ గోనె అందజేశారు.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

ఆల్‌టైమ్ గరిష్ఠం నుంచి తగ్గిన సూచీలు

ముంబై, జనవరి 16: వరుస రికార్డులతో అదరగొట్టిన స్టాక్ మార్కెట్ మంగళవారం చిన్న బ్రేక్ తీసుకుంది. స్టాక్ సూచీలు ట్రేడింగ్ తొలిదశలో కొత్త రికార్డు గరిష్ఠస్థాయిల్ని చేరిన తర్వాత వెనక్కు మళ్లాయి. వరుసగా ఐదు రోజులపాటు ర్యాలీ జరిగిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో బీఎస్ఈ సెన్సెక్స్ 199 పాయింట్లు క్షీణించి 73,129 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో ఇది 73,428 పాయింట్ల వద్ద కొత్త రికార్డుస్థాయిని తాకింది. తాజాగా ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 22,124 పాయింట్ల ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన అనంతరం చివరకు 65 పాయింట్ల నష్టంతో 22,032 పాయింట్ల వద్ద ముగిసింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,972 పాయింట్లు, నిఫ్టీ 584 పాయింట్ల చొప్పున ర్యాలీ చేశాయి. స్టాక్ విలువలు అమాంతంగా పెరగడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారని, అంతర్జాతీయ బలహీన సంకేతాలు ఇందుకు పురికొల్పాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఐటీ, రియల్టీ, ఎనర్జీ షేర్లలో లాభాల స్వీకరణ జరిగిందని, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లు వెలుగులో నిలిచాయని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా వివరించారు.

ఐటీ డౌన్

ప్రధాన కంపెనీలు ఆర్థిక ఫలితాల్ని వెల్లడించిన తర్వాత అతిపెద్ద ర్యాలీ జరిపిన ఐటీ షేర్లు తాజాగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ షేర్లలో అన్నింటికంటే అధికంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.05 శాతం క్షీణించగా, విప్రో 1.93 శాతం, ఇన్ఫోసిస్ 1.27 శాతం, టెక్ మహీంద్రా 1.17 శాతం, టీసీఎస్ 1.06 చొప్పున తగ్గాయి. ఇతర రంగాల షేర్లలో ఎన్టీపీసీ 1.84 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.43 శాతం మేర క్షీణించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, ఎం అండ్ ఎం, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, ఎస్బీఐలు సైతం నష్టాలతో ముగిసాయి. మరో వైపు టాటా స్టీల్, టైటాన్, మారుతి, లార్సన్ అండ్ టుబ్రో, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌లు 1-2 శాతం మధ్య లాభపడ్డాయి.

కొనసాగిన ఎఫ్‌పీఐ కొనుగోళ్లు

ఆసియాలో సియోల్, టోక్యో, హాంకాంగ్ సూచీలు తగ్గగా, షాంఘై పాజిటివ్‌గా ముగిసింది. యూరప్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ స్టాక్ సూచీలు కూడా తగ్గాయి. అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర 78 డాలర్ల ఎగువన ట్రేడవుతున్నది. సోమవారం రూ. 1,085 కోట్ల నికర కొనుగోళ్లు జరిపిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మంగళవారం మరో రూ.650 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

మద్దతు 21,950

మంగళవారంనాటి ట్రేడింగ్ ప్రథమార్ధంలో బుల్స్ ఆధిపత్యం చెలాయించగా, ద్వితీయార్ధంలో బేర్స్ పట్టుచిక్కించుకున్నారని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ డెరివేటివ్ అనలిస్ట్ కునాల్ షా చెప్పారు. తదుపరి ఒకటి, రెండు రోజుల్లో నిఫ్టీ 22,300 పాయింట్లకు చేరాలంటే 21,150 స్థాయిని బ్రేక్‌చేసి నిలదొక్కుకోవాలని విశ్లేషించారు. 21,950 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నదన్నారు.

హైదరాబాద్-రియాద్ మధ్య ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్, జనవరి 16: రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులు కూడా భారీగా పెరుగుతున్నాయి. దీంట్లో భాగంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తాజాగా హైదరాబాద్-రియాద్‌ల మధ్య విమాన సర్వీసును ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 2 నుంచి ఈ సర్వీసు అందుబాటులోకి రానున్నది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12.05 గంటలకు బయలుదేరనున్న విమానం రియాద్‌కు 3 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో 4 గంటలకు రియాద్‌లో బయలుదేరనున్న సర్వీసు తిరిగి హైదరాబాద్‌కు రాత్రి 11 గంటలకు చేరుకోనున్నది. కేవలం సోమ, బుధ, శుక్ర వారాల్లో మాత్రమే ఈ సర్వీసు నడవనున్నది.

హైదరాబాద్-సూరత్‌ల మధ్య స్టార్ విమాన సర్వీసులు

హైదరాబాద్-సూరత్‌ల మధ్య విమాన సర్వీసును ప్రారంభించబోతున్నట్లు స్టార్ ఎయిర్ ఇండియా ప్రకటించింది. సూతన రూట్లలో సర్వీసులు అందించడంలో భాగంగా ఈ నెల 23 నుంచి హైదరాబాద్-సూరత్‌ల మధ్య వారానికి మూడు రోజులు (మంగళ, బుధ, గురు) మాత్రమే ఈ సర్వీసును నడుపుతున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో ఈఏ నూతన ఆఫీస్

3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కంప్యూటర్ గేమింగ్ దిగ్గజ సంస్థ ఎలక్ట్రానిక్ ఆర్ట్(ఈఏ) తాజాగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని నాలెడ్జ్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించింది. ఇప్పటికే సంస్థకు ఇక్కడే ఆఫీస్ నిర్వహిస్తున్నది. నగరంలో గేమింగ్ కార్యకలాపాలకు అనుగుణంగా ఉండటంతోపాటు నైపుణ్యం కలిగిన టెక్నాలజీ నిపుణులు లభిస్తుండటంతో ఇక్కడే తమ వ్యాపారాన్ని విస్తరించినట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే కేసీఆర్ ప్రభుత్వం గేమింగ్, యానిమేషన్ రంగ అభివృద్ధి కోసం ఇమేజ్ టవర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

బీఈ 'కార్బేవ్యాక్స్'కు డబ్ల్యూహెచ్‌వో ఈయూఎల్

హైదరాబాద్, జనవరి 16: హైదరాబాద్‌కు చెందిన వ్యాక్సిన్ల, ఔషధాల తయారీ రంగ సంస్థ బయోలాజికల్ ఈ. లిమిటెడ్ (బీఈ) రూపొందించిన 'కార్బేవ్యాక్స్' వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి ఎమర్జన్సీ యూజ్ లిస్టింగ్ (ఈయూఎల్) ఆథరైజేషన్ లభించింది. ఈ మేరకు మంగళవారం బీఈ తెలియజేసింది. ఇది స్వదేశీ పరిజ్ఞానంతో దేశంలో తయారైన తొలి కొవిడ్-19 ఆర్బీడీ ప్రొటీన్ సబ్-యూనిట్ వ్యాక్సిన్ కావడం విశేషం. 18 ఏండ్లు, ఆపై వయసున్నవారికి దేశీయ తొలి హెటిరోలోగస్ కరోనా బూస్టర్ కూడా ఇదే. ఇప్పటికే డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి దీనికి అనుమతి లభించిన సంగతి విదితమే. కేంద్ర ప్రభుత్వానికి 100 మిలియన్లకు పైగా కార్బేవ్యాక్స్ డోసులను బీఈ సరఫరా చేసింది. కాగా, ఈ వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో నుంచి ఈయూఎల్ ఆథరైజేషన్ లభించడంపట్ల సంస్థ ఎండీ మహిమా దాట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ3లో రూ.16,373 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 16: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,373 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,259 కోట్ల లాభంతో పోలిస్తే 34 శాతం అధికం. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.51,208 కోట్ల నుంచి రూ.81,720 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

- సమీకృత నికర లాభం ఏడాది ప్రాతిపదికన 39 శాతం అధికమై రూ.12,735 కోట్ల నుంచి రూ.17,718 కోట్లకు.
- కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.54,123 కోట్ల నుంచి రెండింతలు పెరిగి రూ.1,15,015 కోట్లకు చేరింది.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.23 శాతం నుంచి 1.26 శాతానికి పెరిగింది. కానీ, నికర ఎన్‌పీఏ 0.33 శాతం నుంచి 0.31 శాతానికి దిగొచ్చింది.
- నికర వడ్డీ ఆదాయం రూ.22,990 కోట్ల నుంచి రూ.28,470 కోట్లకు పెరిగింది. శాతం పరంగా చూస్తే 23.9 శాతం అధికం.
- బ్యాంక్ డిపాజిట్లు 27.7 శాతం పెరిగి రూ.28.47 లక్షల కోట్లకు చేరాయి. ఏడాది క్రితం ఇది రూ.22.29 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- అడ్వాన్స్‌లు 62.4 శాతం అధికమై రూ.24.69 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

13 వేల శాఖలకు..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే మూడు నుంచి ఐదేండ్లకాలంలో మొత్తం శాఖల సంఖ్య 13 వేలకు పెంచుకోనున్నట్టు బ్యాంక్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ తెలిపారు. గత త్రైమాసికంలో కొత్తగా ఏర్పాటు చేసిన 146 శాఖలు కలుపుకొని గడిచిన 12 నెలల్లో బ్యాంక్ 908 శాఖలను ప్రారంభించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1,481 శాఖలను స్టార్ట్ చేసింది.

సరికొత్త క్రెటా వచ్చేసిందోచ్..

గరిష్ఠ ధర రూ.19.99 లక్షలు

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన హ్యుందాయ్..తన ఎస్‌యూవీ పరిధిని మరింత బలోపేతం చేసే దిశగా దేశీయ మార్కెట్లోకి సరికొత్త మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన క్రెటాను ఆధునీకరించి మళ్లీ విడుదల చేసింది. ఈ మాడల్ రూ.10.99 లక్షల ప్రారంభ ధరతో గరిష్ఠంగా రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఎస్‌యూవీలకు గిరాకీ ఎక్కువగా ఉండటంతో